# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాల్దీవుల పర్యటనను కొద్ది సేపటి క్రితం ముగించుకొని తమిళనాడులోని ట్యుటికోరిన్ కు చేరుకున్నారు.
- ❖ కార్గిల్ విజయ్ దివస్ 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాణ త్యాగం చేసిన భారత సైనికుల ధైర్యసాహసాలను ఈరోజు దేశ ప్రజానీకమంతా స్మరించుకుంటోంది.
- ❖ భారత్ బ్రిటన్ దేశాల మధ్య ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల పురోగతిలో కీలకంగా నిలుస్తుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విశ్వాసం వ్యక్తం చేశారు.
- ❖ కార్గిల్ యుద్ధం తరహాలో ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ లో కూడా భారత సాయుధ దళాలు పోరాట పటిమను చూపాయని సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాల్దీవుల పర్యటన కొద్ది సేపటి క్రితం ముగిసింది. ఈ పర్యటనలో భాగంగా రాజధాని మాలేలో ఈరోజు జరిగిన మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నరేంద్ర మోదీ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఆ తరువాత మాల్దీవుల ఉపాధ్యక్షులు హుస్సేన్ మొహమ్మద్ లతీఫ్‌తో సమావేశమయ్యారు. భారత్ - మాల్దీవుల స్నేహానికి కీలకమైన అంశాలపై ఇరువురు ఈ సందర్భంగా చర్చించారు. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, వాతావరణ మార్పులు, ఇంధన శక్తి మొదలగు పలు రంగాలపై ఈ చర్చలు దృష్టి సారించాయి. అంతకముందు పీపుల్స్ మజ్లిస్ స్పీకర్ అబ్దుల్ రహీం అబ్దుల్లాతో కూడా ప్రధానమంత్రి ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల తమిళనాడు పర్యటన నిమిత్తం కొద్ది సేపటి క్రితం ట్యుటికోరిన్ చేరుకున్నారు. ట్యుటికోరిన్ విమానాశ్రయం నూతన టెర్మినల్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అదే విధంగా 4 వేల 800 కోట్ల రూపాయల విలువైన వివిధ ప్రాజెక్టులకు నరేంద్ర మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ నూతన టెర్మినల్ కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యాలను, ట్యుటికోరిన్ నుండి ఎగుమతి కార్యకలాపాలను ప్రోత్సహిస్తుందని ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి పి. వెంకటేష్ వెల్లడిస్తూ...

(వాయిస్ 19 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కార్గిల్ విజయ్ దివస్ 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 1999 కార్గిల్ యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన భారత సైనికుల ధైర్యసాహసాలను ఈరోజు దేశ ప్రజానీకమంతా స్మరించుకుంటోంది. దాదాపు 60 రోజుల పాటు వీరోచిత పోరాటం చేసి 1999 భారత్ - పాకిస్తాన్ యుద్ధంలో విజయం సాధించిన భారత రక్షణ దళాల పరాక్రమాన్ని గుర్తు చేసుకునేందుకు ప్రతీ ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటాం. కార్గిల్, జమ్మూ, కాశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో పాకిస్తాన్ సైనికులు, ఉగ్రవాదులు చొరబడిన ప్రాంతాలపై తిరిగి నియంత్రణను సాధించడానికి భారత సాయుధ దళాలు ఆపరేషన్ విజయ్ ను చేపట్టాయి. కెప్టెన్ విక్రమ్ బాత్రా, కెప్టెన్ మనోజ్ కుమార్ పాండే, గ్రెనేడియర్ యోగేంద్ర సింగ్ యాదవ్ వంటి ధైర్యవంతులైన సైనికులు పాకిస్తాన్ సైన్యాన్ని ధీటుగా ఎదుర్కొని యుద్ధ క్షేత్రంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం భారత సాయుధ దళాలు బలమైన దృఢ సంకల్పాన్ని ప్రదర్శించి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమరవీరులకు సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది నివాళులు అర్పించారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఈరోజు ఆయన ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారక చిహ్నంలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర కార్మిక శాఖా మంత్రి మన్సూఖ్ మాండవీయ, రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ... భారత సైన్యం ప్రస్తుత సవాళ్లను విజయవంతంగా ఎదుర్కోవడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండేలా రుద్ర పేరిట "ఆల్ ఆర్మ్స్ బ్రిగేడ్'ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. సాయుధ యూనిట్ల ఫిరంగిదళం, ప్రత్యేక దళాలు, మానవరహిత వైమానిక వ్యవస్థలు వంటివి "రుద్ర" కలిగి ఉంటుందన్నారు. భైరవ్ అనే లైట్ కమాండో బెటాలియన్ యూనిట్లను కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. కార్గిల్ యుద్ధంలో మాదిరిగా ఇటీవల జరిగిన "ఆపరేషన్ సింధూర్"లో కూడా భారత సాయుధ దళాలు పోరాట పటిమను చూపాయని సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు.

(వాయిస్ 31 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

థాయిలాండ్ కంబోడియా దేశాల సరిహద్దుల వద్ద ఘర్షణలు ఈరోజు కూడా కొనసాగుతున్నాయి. ఈ ఉద్రిక్తతల కారణంగా మరణాల సంఖ్య 33కి చేరింది. కంబోడియాలో ఎనిమిది మంది పౌరులు సహా 13 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఇక థాయిలాండ్ తమ దేశంలో 20 మంది ప్రాణాలు కోల్పోయారని ధృవీకరించింది. ఇరు వైపులా సరిహద్దు ప్రాంతాల నుండి లక్షల సంఖ్యలో ప్రజలు వేరే ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ కాల్పుల విరమణ కోసం కంబోడియా పిలుపునిచ్చినప్పటికీ.. ఘర్షణలు మాత్రం కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా ఈ ఘర్షణల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని కంబోడియాలోని భారత రాయబార కార్యాలయం భారతీయ పౌరులకు సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అత్యుత్తమ పనితీరు కనబరిచిన 17 మంది పార్లమెంట్ సభ్యులను "సంసద్ రత్న 2025" అవార్డులు వరించాయి. పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు వారికి ఈ అవార్డులను ఈరోజు న్యూఢిల్లీలో ప్రధానం చేశారు. ఈ

సందర్భంగా ఆయన పార్లమెంట్ సభ్యులను అభినందించారు. వారు కనబరిచిన అత్యుత్తమ పనితీరుకి ఇది గుర్తింపు అని అన్నారు. భారతీయ జనతా పార్టీ నుండి రవి కిషన్ దినేష్ శర్మ, కాంగ్రెస్ పార్టీకి చెందిన వర్ష గైక్వాడ్, నేషనల్ కాంగ్రెస్ పార్టీ - ఎన్‌సిపి (ఎస్‌పి) నుండి సుప్రియా సులే శివసేన (యుబిటి) కు చెందిన అరవింద్ సావంత్ ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, బ్రిటన్ దేశాల మధ్య ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల పురోగతిలో కీలకంగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈరోజు న్యూఢిల్లీలో ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... ఈ వాణిజ్య ఒప్పందం రెండు దేశాల ప్రధాన ప్రయోజనాలను కాపాడుతూనే అనేక రంగాల్లో విస్తారమైన అవకాశాలను కల్పిస్తుందన్నారు. అదే విధంగా అంతర్జాతీయ వాణిజ్యంలో భారతదేశపు ప్రాముఖ్యతను ఈ ఒప్పందం తెలియజేస్తోందని పీయూష్ గోయల్ పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ టెస్టు మ్యాచ్ లో భారత్ రెండవ ఇన్నింగ్స్‌లో టీ విరామ సమయానికి 2 వికెట్లు నష్టపోయి 86 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ తొలి ఇన్సింగ్స్‌లో 669 పరుగులు చేయడంతో భారత్ ఇంకా 225 పరుగుల వెనుకంజలో ఉంది. భారత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 52, కె ఎల్ రాహుల్ 30 పరుగులతో క్రీజ్‌లో నాటౌట్ గా నిలిచారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో రేపు భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే తీవ్ర ప్రమాద హెచ్చరికలను జారీ చేసింది. మరిన్ని వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త వెల్లడిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =